రైతన్నా.. మీకోసం..!

తొలిరోజే కదిలిన అధికార యంత్రాంగం

- రైతులను కలిసిన ప్రజా ప్రతినిధులు, నాయకులు
- లాభసాటి వ్యవసాయం కోసం పంచసూత్రాలపై అవగాహన
- ఏపీఏఐఎంఎస్ యాప్‌లోని అంశాలపై కూడా..!

అనంతపురం అర్బన్, పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లాభసాటి వ్యవసాయం కోసం పంచ సూత్రాలతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన రైతన్నా.. మీ కోసం' కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వెళ్లి పంచ సూత్రాలపై అవగాహన కల్పించడం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు రైతులకు రాసిన లేఖను కరపత్రం రూపంలో రైతులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి అమలు చేస్తున్న, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను సీఎం లేఖలో ప్రస్తావించారు. కొత్త ఆలోచనలు పంచుకుంటూ, మార్పునకు నాంది పలికేందుకు ప్రభుత్వానికి అన్నదాతలు అందరూ తోడ్పడాలని లేఖలో సీఎం కోరారు. డిసెంబరు 3వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. చివరి రోజున గ్రామ సభలు, రైతు సేవా కేంద్రాల

(మిగతా 6లో...)



గుత్తి మండలం రజాపురంలో మహిళా రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

రైతు సంక్షేమమే ధ్యేయం

గుత్తి రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. రజాపురంలో వారు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్, రైతులు శివరాజ్, నాగరాజు, సంజీవులు, అంజీ వెంకీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతన్న మీకోసం కరపత్రాలను రైతులకు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఇది రైతు ప్రభుత్వం

ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎ.నారాయణపురంలో స్థానిక నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ రెండు విడతలు అందిందా లేదా ఆరా తీశారు. రైతులు ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో పార్టీలు చూసి పథకాలను అమలు చేశారని, ఇప్పుడు రైతులందరికీ రూ.14 వేలు చొప్పున అందిందని చెబుతున్నారని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేని సమయంలో మద్దతు ధర కల్పించిందని అన్నారు. వైసీపీ పాలనలో రైతులకు ఒరిగింది శూన్యమని అన్నారు. వైసీపీకి రైతులపై ఉన్నది కపట ప్రేమ అని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి వెంకటకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు మల్లికార్జున, మురళీకృష్ణ, భాగ్యశ్రీ, వెటర్నరీ అసిస్టెంట్ మమత, మాజీ ఎంపీటీసీ నాగరాజు, టీడీపీ నాయకులు భాగ్యరాజ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహణ..

రైతన్నా... మీ కోసం' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి రైతు ఇంటికి వెళ్లి సీఎం లేఖలో ప్రస్తావించిన పంచసూత్రాలను వివరిస్తున్నాం. సీఎం లేఖ కరపత్రాలను రైతులకు అందిస్తున్నాం. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న పథకాలు, రాబోవు రోజుల్లో చేయబోవు పనులను వివరిస్తున్నాం. ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను రైతుల సెల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి, వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి



స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఏఎంసీ కమిషనర్

ప్రతి ఇంట్లో మహిళా పారిశ్రామికవేత్త

అదే సీఎం చంద్రబాబు లక్ష్యం

ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఓ మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని అంబేడ్కర్‌భవన్‌లో అనంత నగరపాలక సంస్థ, మెప్మాల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ, ఈబైకుల అందజేత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా పక్షపాతిగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందుతూ మరి కొంతమందికి ఉపాధి కల్పించేలా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా నగరంలోని 846స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ కింద రూ.126కోట్లు, స్వయం ఉపాధి పథకం కింద 102మంది సభ్యులకు రూ.33లక్షలు, ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ భారత్ స్వనిధి కింద 87మంది వీధి వ్యాపారులకు రూ.2కోట్లు, 25మంది సభ్యులకు 25ర్యాపిడో ఈ బైకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఆసుపత్రి కమిటీ సభ్యుడు గంగారామ్, కార్పొరేషన్ల డైరెక్టర్లు పరమేశ్వర్, మూర్తి, కొండన్న, లక్ష్మీనరసింహులు, పవన్‌కుమార్, బొమ్మినేని శివ, రంగాచారి, కార్పొరేటర్ బాలాంజినేయులు, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రమేష్, రాష్ట్ర అధికారప్రతినిధి సాకే లక్ష్మి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి

వికసిత్ భారత్ కోసం పని చేయాలి

- ఎల్బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధన కోసం జిల్లా అధికారులు నిరంతరం పనిచేయాలని ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆయా శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ ఒ.ఆనంద్‌తో కలిసి ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ తరణికంటి మాట్లాడుతూ... ఐఏఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చే అత్యుత్తమ సంస్థలో విశేష అనుభవం గడించిన అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని శిక్షణలో మార్పులు, చేర్పులు చేయడానికి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. సృజనాత్మక ఆలోచనలతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడంతో పాటు సమాజాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి జిల్లా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు కింది స్థాయి అధికారుల పనితీరులో మార్పు వచ్చేలా నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ...తెలుగు వ్యక్తి జిల్లాకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లా అధికారులకు ముస్సోరీలో శిక్షణ ఇవ్వాలని, అధికారుల అనుభవానికి సృతజనాత్మకత జోడించడానికి శిక్షణ ఇస్తే బాగుంటుందని డీఆర్ఓ మలోల, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే నియామకాలు

ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వర నాయక్



మాట్లాడుతున్న పరమేశ్వరనాయక్

అనంతపురం వైద్యం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకే డీసీసీ అధ్యక్షులను నియమించనున్నట్లు కర్ణాటక మాజీ మంత్రి, ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వరనాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పరమేశ్వర నాయక్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాలకు నూతన డీసీసీలను నియమిస్తున్నట్లు తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షతన డీసీసీలను నియమించేవారన్నారు. అయితే ఈ దఫా స్థానిక కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తీసుకుని నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్ష స్థానం కోసం ప్రతి జిల్లాకు ఆరుగురితో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వారిలో కార్యకర్తలు, నాయకులు సూచించిన వారినే డీసీసీ అధ్యక్షులుగా నియమిస్తామని తెలిపారు. ఇదేపద్ధతిలో నియోజకవర్గ అధ్యక్షులను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ అబ్జర్వర్లు అంబటి రామకృష్ణయాదవ్, అలీఖాన్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని వారికి కాంట్రాక్టా..?

- ఆమోదించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని సస్పెండ్ చేయాలి
- పీజీఆర్ఎస్‌లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు వినతి
- అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హత, అనుభవం లేని కాంట్రాక్టర్ టెండర్లను ఆమోదించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్‌ను సస్పెండ్ చేసి, విచారణ జరిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం టెండర్ల ఆమోదంపై ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు తాగునీరు అందుతోందన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి 4 ప్రాంతాలకు అడపాల వెంకటరావును కాంట్రాక్టర్‌గా ఆమోదించారన్నారు. ఈ టెండర్‌కు కావాల్సిన అనుభవం, అర్హతలు ఉండాల్సిన సాల్వెన్సీ, ఇనకమ్ టాక్స్ సర్టిఫికెట్ కెపాసిటీ లేకపోయినప్పటికీ కాంట్రాక్టర్‌గా వెంకటరావును ఆమోదించారన్నారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గతంలో ఒంగోలు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా పనిచేసిన పరిచయాలు, సంబంధాలతో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆ కాంట్రాక్టర్ వచ్చినప్పటి నుంచి హిందూపురం, మడకశిర నియోజకవర్గాలలో ఒక్క గ్రామానికి కూడా తాగునీరు సరఫరా చేయలేదన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాలకు నవంబరు 4 నుంచి తాగునీరు ఆగిపోయిందన్నారు. ఈ టెండరును రద్దు చేయాలని కోరారు.

రోస్టర్‌ను తుంగలో తొక్కారు

పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6 నుంచి గ్రేడ్-5కు ఇచ్చే ప్రమోషన్లకు సంబంధించి రోస్టర్ విధానాన్ని తుంగలో తొక్కి మాదిగ కులానికి తీవ్ర అన్యాయం చేశారని సచివాలయ ఉద్యోగులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరితో కలిసి ఉద్యోగులు మైలారప్ప, ఓబుళేసు, రామకృష్ణ వినతి పత్రం అందజేశారు. ఓపెన్ కేటగిరిలో వచ్చిన ఎస్సీలను కూడా రిజర్వేషన్ కోటాలో చూపడం దారుణమని తెలిపారు. 25న జరిగే కౌన్సెలింగ్‌ను రద్దు చేయాలని కోరారు.

అర్జీలను పరిష్కరించకపోతే కఠిన చర్యలు

పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నాణ్యతగా పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి పీజీఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి 450 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పీజీఆర్ఎస్ అర్జీలకు సంబంధించిన ఆడిట్‌ను జిల్లా అధికారులు ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. ఆర్డీఓలు, జిల్లా అధికారులు ప్రతి వారం తనిఖీలు నిర్వహించాలన్నారు.

వచ్చేసింది.. జాబితా..!

టీడీపీ మండల కన్వీనర్ల నియామకం



లక్ష్మీనారాయణ



మారుతీనాయుడు



గుత్తా శీన



కుళ్లాయప్ప



పాండురంగనాయకులు




దొడ్ల రామాంజి

బుక్కరాయసముద్రం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ శింగనమల నియోజకవర్గ మండల కన్వీనర్ల జాబితా సోమవారం రాత్రి విడుదలైంది. టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర ఈ జాబితాను విడుదల చేశారు. బుక్కరాయసముద్రం మండలానికి లక్ష్మీనారాయణ, శింగనమలకు మారుతీనాయుడు, పుట్లూరుకు ఓబులాపురం గుత్తా శీశ, నార్పలకు కుళ్లాయప్ప, గార్లదిన్నెకు కురబ రంగనాయకులు(పాండు), యల్లనూరుకు దొడ్ల రామాంజినేయులును కన్వీనర్లుగా నియమించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డికి కొత్త కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.పదివేలకే పట్టా..!

ప్రభుత్వ స్థలాలతో రియల్ వ్యాపారం.. నకిలీ పట్టాలతో పేదల ఇళ్ల స్థలాలు కబ్జా

- రిటైర్డ్ తహసీల్దార్ ఫోర్జరీ సంతకంతో పట్టాలు
- కీలకపాత్ర పోషిస్తున్న ఓ వైసీపీ నాయకుడు



కబ్జా చేసిన స్థలానికి సృష్టించిన నకిలీ పట్టా



కబ్జా చేసి మట్టిని తోలి విక్రయానికి సిద్ధంగా ఉంచిన స్థలం

పామిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో స్థిరపడ్డ వలస జీవులు, నిరుపేదలను టార్గెట్ చేసి ఓ వైసీపీ నాయకుడు సరికొత్త వ్యాపారానికి తెరలేపాడు. రూ.10వేలు ఇస్తే చాలు ఓ రిటైర్డ్ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంటి పట్టాలు పంచేస్తున్నాడు. కొందరు అమాయకుల పేర్లపై నకిలీ పట్టాలు సృష్టించి ప్రభుత్వ ఇళ్ల స్థలాలను దర్జాగా కబ్జా చేసి, అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

జాతీయ రహదారికి ఆనుకుని..

పట్టణంలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చైతన్య కాలనీ, వెంగమనాయుడు కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలలో ఎందరో నిరుపేద కుటుంబాలకు రెవెన్యూ అధికారులు నివేశన స్థలాలను మంజూరు చేశారు. అయితే ఆ స్థలాలను కొందరు ఆక్రమించి, వాటికి నకిలీ పట్టాలు సృష్టించి, యజమానులకు తెలియకుండానే అమ్మేస్తున్నారు. ఈ వ్యవహారం ఓ వైసీపీ నాయకుడికి, ఆయన అనుచర గణానికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఒకే స్థలానికి సంబంధించి ఇద్దరు, ముగ్గురికి పట్టాలు అందజేసి జేబులు నింపుకుంటున్నారు. ఇదే ఆ వైసీపీ నాయకుడికి జీవనోపాధిగా మారింది. ఈ నకిలీ పట్టాల వ్యవహారంపై వైసీపీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకే స్థలానికి సంబంధించి ఇద్దరు, ముగ్గురికి పట్టా ఇవ్వడంతో వారు గొడవపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. స్థలం ఖాళీగా కనిపిస్తే దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. ఆఘమేఘాల మీద నకిలీ పట్టా సృష్టించి ఆ స్థలం తమదేనంటూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

దౌర్జన్యం.. ఆక్రమణలు

పట్టణంలోని వెంగమనాయుడు, చైతన్య కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలు 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. ఈ కాలనీలలో కొన్నేళ్ల కిందట నిరుపేద కుటుంబాలకు మంజూరు చేసిన నివేశన స్థలాలు కొన్ని ఖాళీగా ఉన్నాయి. గతంలో రెవెన్యూ అధికారులు ఏయే ప్లాట్లు ఖాళీగా ఉన్నాయో సర్వే చేపట్టి జాబితా తయారు చేశారు. ఆ జాబితా కొందరు ఆక్రమణదారుల చేతికి చేరింది. కేసులు, గొడవలు కొత్తకాదు.. అంతుచూస్తామంటూ నిరుపేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అమాయకుల పేర్లపై నకిలీ పట్టాలు పుట్టించి దౌర్జన్యంగా ఆక్రమించుకొని వ్యాపారాన్ని సాగిస్తున్నారు. అసలు పట్టాదారులు న్యాయం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం శూన్యమని వాపోతున్నారు. రెవెన్యూ అధికారులకు బాధితులు తమగోడు విన్నవించుకుంటే ఇటీవలే వచ్చామని, విచారణ చేపట్టి తగిన న్యాయం చేస్తామని సర్దిచెప్పి పంపిస్తున్నారు.

టీడీపీ వైపు ఆ వైసీపీ నాయకుడి చూపు

అక్రమాలు బయటపడుతుండటంతో ఆ వైసీపీ నాయకుడికి భయం పట్టుకుంది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అయన చూపు టీడీపీ వైపు మళ్లింది. ఎలాగైనా టీడీపీలో చేరాలని పావులు కదుపుతున్నారు. టీడీపీలోకి సాధ్యం కాకపోతే బీజేపీ, జనసేనలోకైనా చేరేందుకు సిద్ధంగా ఉన్నాడు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ కార్యక్రమాల్లో ఆయన ఎక్కడా కనపడకపోవడం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు, వాగులు, వంకలను ఆక్రమించి ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు తప్పవు. ఈ మధ్యకాలంలో చాలా మంది నకిలీ పట్టాలు తీసుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆక్రమణదారులకు అండగా నిలిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. బాధితులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటాం.

- షర్మిల, తహసీల్దార్, పామిడి

ఆసుపత్రిలో భాగం కోసమే దాడి

- అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి సహా ఏడుగురి అరెస్ట్
- టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ వెల్లడి

7

వైసీపీ నేతల ఆగడాలను అరికట్టండి

ఎస్పీకి టీడీపీ నేతల వినతి

6

నీటి విడుదలపై నీలినీడలు..!

మరమ్మతులకు నోచని పీఏబీఆర్ కుడికాలువ గేట్లు

కిందికి దిగని జల విద్యుత్ కేంద్రం గేటు

350 క్యూసెక్కుల నీరు వృథాగా బయటకు..



కుడికాలువ గేటును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కూడేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లోని కుడికాలువ గేట్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా కుడికాలువకు నీరు విడుదల చేసే గేటు సక్రమంగా పని చేయకపోవడంతో ఇరిగేషన్ అధికారులు మెకానిక్‌లతో తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. ఈ ఏడాది పీఏబీఆర్ డ్యాంకు హంద్రీ-నీవా, తుంగభద్ర డ్యాం నుంచి నీరు పెద్ద ఎత్తున వస్తోంది. నీటి మట్టం 5 టీఎంసీలకు దాటింది. దీంతో ఇరిగేషన్ అధికారులు జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో నీటిమట్టం 435.600 మీటర్ల వద్దకు చేరుకొని 5.271 టీఎంసీల నిల్వ ఉంది. హంద్రీ-నీవా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 860 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని అధికారులు తెలిపారు. పీఏబీఆర్ నుంచి కుడికాలువ ద్వారా 112 కిలో మీటర్ల దూరంలోనున్న చెరువులకు నీటిని సరఫరా చేస్తారు. కొన్ని సంవత్సరాలుగా కుడికాలువకు నీరు వదిలే గేట్లు రెండు మరమ్మతులకు నోచుకోలేదు. డ్యాం నిర్మాణ సమయంలో అమర్చిన గేట్లకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. రెండ్రోజుల క్రితం పరిశీలించిన అధికారులు గేటుకు మరమ్మతులు చేయాల్సిందేనని నిర్ధారణకు వచ్చారు. మెకానిక్‌ల ద్వారా మరమ్మతులు చేయించేందుకు కసరత్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

హంద్రీ-నీవా, తుంగభద్ర డ్యాం నీరు పీఏబీఆర్‌లోకి ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీరు వెళ్లే గేటు కు మొరాయించడంతో జెన్‌కో అధికారులు ఆపసోపాలు పడి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కొన్ని రోజులు విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఈనెలలో కుడికాలువకు నీరు విడుదల చేయడానికి సమయం ఆసన్నం కావడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని ఇరిగేషన్ అధికారుల నుంచి జెన్‌కో అధికారులకు సమాచారం పంపారు. దీంతో మూడు రోజుల క్రితం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. డ్యాం నుంచి జల విద్యుత్ కేంద్రంలోకి నీరు రాకుండా గేటు బంద్ చేయడానికి వెళ్లిన జెన్‌కో అధికారులకు చమటలు పట్టాయి. గేటు కిందికి దిగకపోవడంతో దాదాపు 345 క్యూసెక్కుల నీరు జల విద్యుత్ కేంద్రం గేటు నుంచి మిడ్ పెన్నార్ డ్యాంలోకి వృథాగా బయటకు వెళుతోంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. తక్షణం గేటు బంద్ చేయాలని, లేకుంటే నీరు బయటకు వృథాగా వెళుతుందని ఇరిగేషన్ డీఈ వెంకటరమణ సూచించారు. దీంతో జెన్‌కో అధికారులు గేటును కిందికి దించడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మెకానిక్‌లతో మరమ్మతులు చేయిస్తున్నారు.

మరమ్మతుల తర్వాతే నీటి విడుదల

పీఏబీఆర్ డ్యాం కుడికాలువ నుంచి నీరు విడుదల చేయడానికి గేటు మరమ్మతుల్లో ఉంది. రెండ్రోజుల్లో గేటు మరమ్మతులు చేయడానికి సంబంధిత మెకానిక్‌లు వస్తున్నారు. కుడికాలువకు ఉన్న రెండు గేట్లు రిపేరి ఉండటంతో నీరు విడుదల సాధ్యం కాదు. దీంతో మరమ్మతుల అనంతరం కుడికాలువకు నీరు విడుదల చేస్తాం. ఒక్కరోజులోనే గేటు రిపేరి పూర్తయితే అనుకున్న సమయానికి నీరు వదులుతాం. లేకపోతే మరింత సమయం పట్టవచ్చు.

– సుధాకర్ రావు, ఎస్ఈ, జలవనరుల శాఖ

బాలల రక్షణ మన బాధ్యత

జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



విద్యార్థులకు బ్యాడ్జీలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. జిల్లాలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ పాల్గొని కిశోరి వికాస బ్యాడ్జిలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో అబ్బాయిల కోసం యువ, అమ్మాయిల కోసం సఖి అనే పేర్లతో గ్రూపులను ఏర్పాటు చేసి, నాయకత్వ బాధ్యతలు చేపట్టే వారికి ఈ బ్యాడ్జీలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పీడీ ప్రమీల, డీఈఓ క్రిష్టప్ప, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరం

అనాథ పిల్లల దత్తత తీసుకునేవారు.. చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా దత్తత తీసుకుంటే అన్ని విధాల శ్రేయస్కరమని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన దత్తత అవగాహన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పిల్లలను చట్టపరమైన ప్రక్రియల ద్వారా మాత్రమే దత్తత తీసుకోవాలని సూచించారు.

వక్కల లెక్క తేలింది

కిలో రూ.570... నోటీసులకు ఆదేశం

ఒక్కో వాహనానికి రూ.1.20 కోట్లు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వక్కల లెక్క తేలింది. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేశారు. ఈనెల 18న కర్ణాటక నుంచి ఢిల్లీకి అక్రమంగా వక్కలు తరలిస్తుండగా మూడు వాహనాలతో పాటు మరో వాహనంలో గుట్కా తరలిస్తూ పన్నుల శాఖకు అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఒక్కో వాహనంలో 20 నుంచి 22 టన్నుల వరకు వక్కలు తరలిస్తూ ఎలాంటి బిల్లులు లేనట్లు అధికారుల పరిశీలనలో తేలింది. వక్కలు కిలో ఎంత ధర పలుకుతోందో తేల్చడానికి కర్ణాటక రాష్ట్రంలోని తుంకూరుకు వక్కల శాంపిల్స్ పంపారు. అక్కడ ఆ వక్కలు కిలో రూ.570 పలుకుతున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఆ మేరకు ఒక్కో వాహనంలో 20వేల కిలోల వక్కలు తరలిస్తున్నారు. జీఎస్టీ ఎగవేసినందుకు ఆ మేరకు ఒక్కో వాహనానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.30 కోట్ల వక్కల అసలు ధర చెల్లించేలా నోటీసులు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అదేవిధంగా ఒక్కో వాహనానికి రూ.6 లక్షల చొప్పున జరిమానా విధించాలని ఆదేశించినట్లు సమాచారం.

డ్రైడే కొనసాగించాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు కొనసాగించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వాటర్, శానిటేషన్ మిషన్ కమిటీ మీటింగ్‌ను ఆర్‌డబ్ల్యుఎస్, డీపీఓ, జడ్పీ, అగ్రి, హెచ్ఎల్‌సీ, డ్వామా, మైనర్ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, దేవాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను కట్టించాలని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ రెండు చొప్పున వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసుకుని వాటిని పూర్తి చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీఓ నాగరాజునాయుడు, డ్వామా పీడీ సలీమ్‌బాషా, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

'దుర్గం' మున్సిపాలిటీకి గ్రేడ్ వన్ హోదా

రాయదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పురపాలక సంఘానికి గ్రేడ్ వన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవ తీసుకుని గ్రేడ్-2 హోదా నుంచి గ్రేడ్ వన్‌గా అప్‌గ్రేడ్ కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై పూర్తిస్థాయిలో నివేదికలను తీసుకుని పరిశీలించిన అనంతరం గ్రేడ్ వన్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాయదుర్గం పురపాలక సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించే నిధుల కోటా పెరుగనుంది. అదే విధంగా సిబ్బంది కూడా అదనంగా పెరుగనున్నారు. గ్రేడ్ 2 హోదా కల్పించి 20 సంవత్సరాలకుపైగా కావడంతో పట్టణ విస్తరణ జరిగిన నేపథ్యంలో గ్రేడ్ వన్ హోదా పొందడానికి అవసరమైన అర్హతలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి ఉత్తర్వులను జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న జిల్లా స్థాయి పారా క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. ఈనెల 26న నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో పారా అథ్లెటిక్ పోటీలు ఉంటాయన్నారు. అదే రోజు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ పారా క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు డిసెంబరు 3న నిర్వహించే అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.

రబీలో సబ్సిడీతో వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్‌లో జిల్లాకు 7,300 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారన్నారు. ఇందులో కే-6 రకం 6వేల క్వింటాళ్లు, టీసీజీఎస్ - 1694 రకం 1300 క్వింటాళ్లు కేటాయించామని తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.9200 నిర్ణయించారన్నారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3,680 పోను రైతు వాటా కింద రూ.5,520 చెల్లించాలని పేర్కొన్నారు.

84 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు

అనంతపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 84 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. డిసెంబరు 5, 14వతేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంత జిల్లాలో 45, సత్యసాయి జిల్లాలో 39 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 2019 సంవత్సరంలో జిల్లా గొర్రెల సహకార సంఘం ఎన్నికలకు ప్రభుత్వం స్టే విధించింది. తాజాగా ఎన్నికల నిర్వహణకు విధించిన స్టే ఎత్తేశారు. ఉమ్మడి జిల్లాలో 215 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలు ఉన్నాయి. 131 సంఘాలకు ఇదివరకే ఎన్నికలు జరిగాయి. ఇంకా 84 సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆయా సంఘాలకు ఎన్నికలు పూర్తి చేసిన తర్వాత జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నారు.

రైతన్నా.. మీకోసం..!

(5వ పేజీ తరువాయి)

సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తారు.

పరికరాలు ఇవ్వండి: రైతులు

గార్లదిన్నె, శింగనమల: ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలు ప్రాంతాల్లో రైతులు తమ సమస్యలను వివరించారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె రైతులు తమకు రాయితీతో వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారులు 52 మంది రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పశువులు లేనికారణంగా సేద్యపు పనులకు ఇబ్బందిగా ఉందని, రాయితీతో యంత్రాలను ఇవ్వాలని తరిమెల రైతులు కోరారు. అన్నదాత సుఖీభవ, ఎరువులు, విత్తనాల పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేశారు. పండించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కూడా రైతులు విన్నవించారు.

కూటమితోనే రైతు సంక్షేమం: నెట్టెం

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ అన్నారు.



రైతన్న మీకోసం కరపత్రాలను రైతులకు అందజేస్తున్న డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ తదితరులు

ఆలమూరులో వ్యవసాయశాఖ అధికారి వెంకటకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరి, సంజీవులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచసూత్రాలు

సీఎం చంద్రబాబు రైతులకు రాసిన లేఖలో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రి టెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచ సూత్రాల వివరాలు ఉన్నాయి. వచ్చే ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు పంచసూత్రాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామని సీఎం ఆ లేఖలో పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు ఏం చెప్పారు..?

నీటి భద్రత: రాష్ట్రంలో ప్రతి ఎకరానికీ సాగునీరు అందించే దిశగా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో అన్ని ప్రాజెక్టులు నిలుపుతామం.

డిమాండ్ ఆధారిత పంటలు: మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటల సాగు పద్ధతులను మార్చుకోవాలి. పంటల మార్పిడి పాటించాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు తదిత పంటలకు మళ్లీ డిమాండ్ వచ్చింది. చిరుధాన్యాల సాగు మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున పాటించాలి.

అగ్రిటెక్: పంటల సాగుకు టెక్నాలజీ తోడైతే రైతులకు తిరుగుండదు. అందుకే ప్రభుత్వం అగ్రిటెక్‌ను ప్రోత్సహిస్తోంది. ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పథకంలో ప్రతి రైతు యూనిక్ ఐడీల నమోదు చేస్తున్నారు. అవసరమైన రైతులందరికీ బిందు, తుంపర సేద్య పరికరాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతులకు వ్యక్తిగతంగా యంత్రాలు సరఫరా చేయడంతోపాటు కిసాన్ డ్రోన్లు అందజేస్తోంది. పంటల ఆరోగ్య స్థితిని అంచనా వేసేందుకు శాటిలైట్ టెక్నాలజీని వాడుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్: పండించిన పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలి. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్ల పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సీఐఐ సదస్సులో ఎంఓయూలు కుదుర్చుకుంది. ఎంటర్‌ప్రెన్యూర్ తరహాలో అగ్రిప్రెన్యూర్ రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అందుకు నాంది పలుకుతుంది.

ప్రభుత్వం నుంచి మద్దతు: రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అందిస్తున్నాం. పంటనష్టం జరిగితే ప్రధాన పంటలకు హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25 వేలు అందజేస్తున్నాం. పీఎం ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను అమలు చేస్తున్నాం. మామిడి పంటను బీమా పరిధిలోకి తెచ్చాం. ఎఫ్‌పీఓలు, ఎంఎస్ఎంఈలు, బిగ్ రిటైలర్ కంపెనీలతో అనుసంధానం చేసి, సమర్థవంతమైన మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేస్తున్నాం. పాడి రైతులకు అండగా నిలుస్తున్నాం. పశు సంవర్ధక రంగంలో దేశంలో మొదటి మూడు స్థానాల్లో రాష్ట్రాన్ని నిలిపేందుకు పాలు, మాంస ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తోంది. మెగా డీఎస్సీ నిర్వహించింది.

ఏపీఏఐఎంఎస్ యాప్

గ్రామాలవారిగా రైతులు, వారు సాగు చేసిన పంటల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. పంటలకు తెగులు సోకితే, వాటి వివరాలు, నివారణ చర్యలను అధికారులు పొందుపరుస్తారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితి, రాబోవు ఐదు రోజుల్లో వర్షసూచనల వివరాలు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను పొందుపరుస్తారు. భూసార పరీక్షల ఆధారంగా ఏ ఏ రకాల ఎరువులు, ఎంత మోతాదులో వేసుకోవాలో యాప్‌లో ఉంటాయి. ఆ వివరాలను ఎలా చూడాలో రైతులకు అధికారులు అవగాహన కల్పించారు.

విజయ దీపిక

అంధుల ప్రపంచ కప్ అందించిన కెప్టెన్.. జిల్లావాసి



ప్రపంచ కప్‌తో దీపిక



దీపిక తల్లిదండ్రులకు సత్కారం

మడకశిర/టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అకుంఠిత దీక్షతో క్రికెట్‌లో ప్రతిభ చూపింది. అద్వితీయ నాయకత్వ పటిమతో భారత జట్టు అంధుల టీ-20 క్రికెట్ ప్రపంచకప్ సాధించేలా చేసింది. ఆమె మరెవరో కాదు అమరాపురం మండలం తంబాలహట్టి గ్రామానికి చెందిన చిక్కతిమ్మన్న, చిత్తమ్మ దంపతుల కూతురు దీపిక. దీపికకు ఐదు నెలల వయసులో చేతి వేలి గోరు తగలడంతో ఒక కన్ను చూపు పోయింది. సరిహద్దులో వీరి ఊరు ఉన్నందున నాలుగో తరగతి వరకు కర్ణాటకలోని ఓ పాఠశాలలో చదివింది. అందరూ అంధురాలు అని ఏడిపిస్తుండటంతో, తల్లిదండ్రులు మైసూరులోని అంధుల పాఠశాలలో చేర్చారు. అప్పటికీ హేళన ఆగలేదు. అదే ఆమెలో పట్టుదలను పెంచింది. ఉన్నత స్థితికి ఎదిగి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె సంకల్పించుకుంది. ఆమె పట్టుదల ముందు వైకల్యం చిన్నబోయింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రికెట్ ఆడటం ప్రారంభించింది. కేవలం రెండెకరాల పొలం ఉన్న ఆమె తల్లిదండ్రులు, వర్షాధారంగా పంటలు సాగు చేస్తూ, కూలి పనులకు వెళుతూ దీపికను పోషించారు. ఎనిమిదో తరగతి నుంచి క్రికెట్‌లో దీపిక మైసూరు అంధుల పాఠశాలలోనే శిక్షణ పొందింది. పదో తరగతి చదువుతున్న సమయంలో అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని సెంచరీ సాధించింది.

ప్రపంచ కప్‌లో..

తొలిసారిగా నిర్వహించిన మహిళా అంధుల టీ-20 ప్రపంచకప్ పోటీలో భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా టైటిల్ నెగ్గడంలో దీపిక సారథ్య ప్రతిభ ఎంతో కనిపిస్తుంది. లీగ్ దశలో పాకిస్తాన్‌పై 48 పరుగులు, సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 98 పరుగులు చేసి మ్యాచ్‌లను గెలిపించింది. కాగా ప్రపంచ విజేతగా నిలిచిన భారత జట్టులో ఇద్దరు తెలుగు యువతులు ఉండటం గమనార్హం. దీపిక తొలుత కర్ణాటక జట్టు కెప్టెన్‌గా పని చేశారు. అనంతరం భారత జట్టులో చోటు దక్కింది. 2023లో ఇంగ్లండ్‌లో నిర్వహించిన టోర్నీలో అద్భుత ఆటతీరుతో క్రీడాభిమానులను ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో క్రీడా కోటాలో ఆమెకు ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఉద్యోగం లభించింది.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ అభినందన

దీపికను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారి స్వగ్రామానికి వెళ్లి, దీపిక తల్లిదండ్రులను సన్మానించారు.

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయాలన్న సీఎం

రింగురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు: మాజీ మంత్రి పల్లె

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని తీర్చిదిద్దాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో సోమవారం ఆయన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి విన్నపం మేరకు పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలను కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణం, బుక్కపట్నం చెరువులో బోటింగ్, సత్య సాయి విగ్రహం ఏర్పాటు, టూరిజం గెస్ట్ హౌస్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి డీపీఆర్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారని తెలిపారు. సత్యసాయి శతజయంతి వేడుకలను వేడుకలు ప్రశాంతంగా ముగియడానికి కృషి చేసిన ప్రభుత్వం, రాష్ట్ర మంత్రుల కమిటీ, జిల్లా కలెక్టర్, ఎస్పీ పాటు పాలుపంచుకున్న అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నా అదృష్టం: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి నియోజకవర్గం తొలి మహిళా ఎమ్మెల్యేగా సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు తన హయాంలో నిర్వహించుకోవడం తన అదృష్టమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. వేడుకలు విజయవంతంగా ముగియడానికి చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, రాష్ట్ర, జిల్లా యంత్రాంగం, సత్యసాయి భక్తులు, ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధిలో సత్యసాయి భక్తులు భాగస్వాములు కావాలన్నారు.

ఉద్యోగోన్నతుల్లో అక్రమాలను నిగ్గు తేల్చాలి

కౌన్సెలింగ్ వాయిదా వేయాలి

డీపీఓతో సంఘాల నాయకుల వాగ్వాదం



డీపీఓకు వినతి పత్రం ఇస్తున్న సాకే హరి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించడంలో భాగంగా తయారు చేసిన జాబితాలో తప్పులతడకలుగా సాగాయి. వాటిని నివృత్తి చేసే వరకు కౌన్సెలింగ్ నిర్వహించడానికి వీలులేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం పలువురు డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. డీపీఓ నాగరాజనాయుడు అందుబాటులో లేకపోవడంతో.. ఏఓ నాగరాజును కలిసి సమస్యలపై చర్చించారు. డీపీఓతో చర్చించాలని చెప్పడంతో ఆయన వచ్చే వరకు అక్కడే వేచి చూశారు. డీపీఓ నాగరాజనాయుడు కార్యాలయంలోకి వచ్చిన తరువాత జేఏసీ నాయకులు ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. ఏఓను కలిసి వివరించాలని తెలిపారు. దీంతో నాయకులు ఏఓ నాగరాజుకు సమస్యలను విన్నవించారు. గ్రేడ్-5 కార్యదర్శులకు సంబంధించి ఎన్ని ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్ని భర్తీ చేస్తున్నారన్నది ప్రశ్నించారు. కేవలం 120 మాత్రమే ఉద్యోగోన్నతి ద్వారా జాబితా తయారు చేశారు. అనంతరం డీపీఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా ఎస్సీ గేటగిరిలో గ్రూప్-2 కేటగిరి కింద ఒకరికి కూడా ఉద్యోగోన్నతి కల్పించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని డీపీఓకు వివరించారు. మంగళవారం నిర్వహించే కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తే కలెక్టర్‌ను సంప్రదించి అందరికి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని డీపీఓ నాగరాజనాయుడుతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారి డిమాండ్ మేరకు మంగళవారం నిర్వహించాల్సిన ఉద్యోగోన్నతుల కౌన్సిలింగ్ వాయిదా వేశారు. అనంతరం సమస్యతో కూడిన వినతిపత్రాన్ని డీపీఓకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఓబిలేసు, రామక్రిష్ణ, బాధిత సిబ్బంది మైలారప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆగడాలను అరికట్టండి

ఎస్పీకి టీడీపీ నేతల వినతి

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో వైసీపీ నాయకుల దాడులు శాంతి భద్రతలను దెబ్బతీసేలా ఉన్నాయని, వారిని కట్టడి చేయాలని టీడీపీ నాయకులు ఎస్పీని కోరారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ జగదీష్‌ను టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయినగర్‌లోని ఆసుపత్రిపై వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీల అనుచరులే దాడికి పాల్పడ్డారని అన్నారు. సుమారు 30 మంది రౌడీ మూకలతో వచ్చి ధ్వంసం చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచరుడు సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మరికొందరు రౌడీ మూకలు పాల్గొన్నారని అన్నారు. ఈ ఘటనలో మూడు కోట్ల ఆస్తులు నష్టం జరిగిందని తెలిపారు. వైసీపీ నేతల చర్యలతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ, నాయకులు సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, మోహన్‌కుమార్, చేపల హరి, కాయగూరల శ్రీధర్, ఇస్మాయిల్, గోపాల్, మహమ్మద్‌రఫీ, రామలింగం పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌లో 99 వినతులు..

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జగదీష్ ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వినతులు ఇచ్చిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.



ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

విజేతలు వీరే..!

● సత్యసాయి శతజయంతి సందర్భంగా వ్యాసరచన పోటీల నిర్వహణ



బహుమతులు పొందిన విద్యార్థులు

పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వ్యాసరచన పోటీలను మూడు విభిన్న స్థాయిలలో నిర్వహించారు. హైస్కూలు స్థాయిలో విద్యార్థులకు (డ్యూటీ ఈజ్ గాడ్), ఇంటర్‌కు(టుమారో ఫ్యూచర్ డిపెండ్స్ ఆన్ వాట్ వుయ్ డు టుడే), డిగ్రీ స్థాయిలో(ట్రాన్స్‌ఫార్మ్ యువర్ సెల్ఫ్ టు ట్రాన్స్‌ఫార్మ్ ది వరల్డ్) వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొత్తం 4,182 విద్యాసంస్థలకు గాను 1,73,030 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వీరిలో 3,360 పాఠశాలల నుంచి 1,32,136 మంది, 566 జూనియర్ కళాశాలల నుంచి 25,684 మంది, 256 డిగ్రీ కళాశాలల నుంచి 15,210 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలు పూర్తయిన తర్వాత రాష్ట్ర స్థాయిలో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో ప్రతిభ చూపి, విజేతలైన ఆరుగురికి రాష్ట్రస్థాయి బంగారు పతకం అందజేశారు. సాయికుల్వంత్ హాలులో ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హిమవాహ్ని రత్నాకర్, కమలా పండ్యా (జాతీయ విద్యా విభాగ సమన్వయకర్త), డాక్టర్ ఎల్.శశిబాల (జాతీయ సేవా విభాగ సమన్వయకర్త-మహిళ) నీతా ఖన్నా(జాతీయ ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త-మహిళ) చేతుల మీదుగా విజేతలకు బంగారు పతకాలను అందజేశారు.

కృత్రిమ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు కృత్రిమ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధి పరుచూరు రమేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ వంటివి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతిఏటా తమ పరిషత్ ఆధ్వర్యంలో జైపూర్ కాలు కంటే నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హత గల దివ్యాంగులు డిసెంబరు 13 లోపు 98495 08904 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు హెచ్చెల్సీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట్ల వీఆర్ఏ వెంకటరాముడు(50) మృతి చెందాడు. సంజీవపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు ఎర్రగుంట్ల వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే తహసీల్దార్ కార్యాలయంలో విధులు ముగించుకుని తమ గ్రామానికే చెందిన ఈశ్వర్ ద్విచక్ర వాహనంపై వీఆర్ఏ వెంకటరాముడు బయల్దేరాడు. అయితే మర్తాడు హెచ్చెల్సీ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన వీఆర్ఏ వెంకటరాముడును 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈశ్వర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

బ్రిడ్జి నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..



మృతి చెందిన వ్యక్తి

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లాక్ టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో బ్రిడ్జి పైనుంచి కింద ఉన్న రెండో రోడ్డు వైపునకు పడిపోవడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకుందామని అతడే దూకాడా...లేక ఉన్నఫలంగా కింద పడిపోయాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. 3వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలను ఆరా తీస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు త్రీటౌన్ సీఐ 9490618679, ఎస్ఐలు: 934691715, 9963346769 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆసుపత్రిలో భాగం కోసమే దాడి

● అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి సహా ఏడుగురి అరెస్ట్
● టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ వెల్లడి



అరెస్టు చేసిన వారిని చూపుతున్న టూ టౌన్ సీఐ

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): షేర్ కోసమే శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో దాడులు చేశారని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. రెంటల్ పార్ట్‌నర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి దురుద్దేశ పూర్వకంగానే ఆసుపత్రిపై దాడి చేశారని ఆయన స్పష్టం చేశారు. దాడికి దిగిన దుండగులను సోమవారం టూ టౌన్ సీఐ అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి సత్యనారాయణరెడ్డితోపాటు మరో ఆరుగురిని అరెస్టు చూపించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. 2020లో పాత పావనీ ఆసుపత్రిని గుత్తా పావని నుంచి శ్రీనివాసరావు, మొగిలి సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, శ్రీలత కొనుగోలు చేశారు. శ్రీనిలయం పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుని, అనంతరం శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు 10 ఏళ్ల లీజ్‌కు ఇచ్చారు. శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఓనర్లుగా శ్రీనివాసరావు, రాఘవేంద్ర ఆసుపత్రిని ఆధునికీకరించుకుంటున్నారు. కేవలం రెంటల్ పార్ట్‌నర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి ఆసుపత్రిలో షేర్ కావాలని అడిగాడు. వాళ్లు అందుకు అంగీకరించకపోవడంతో తన అనుచరులతో మారణాయుధాలతో ఆసుపత్రిపై దాడికి దిగాడు. దుండగులపై కేసు నమోదుచేశారు. నిందితులను ప్రసన్నాయపల్లి గేటు వద్ద అరెస్టు చేశారు. జనశక్తినగర్‌కు చెందిన అడ్వొకేట్ మొగిలి సత్యనారాయణరెడ్డి(45), ఎల్‌బీ కాలనీకి చెందిన సాయినాథ్‌రెడ్డి(46), దాసంపల్లి బీసీ కాలనీకి చెందిన బోయ సీతారాములు(23), దాసంపల్లికి చెందిన యువరాజ్(20), కళ్యాణదుర్గం మండలం నారాయణపురానికి చెందిన చంద్రశేఖర్(21), ఆజాద్‌నగర్‌కు చెందిన షాషావలి(26), విడపనకల్లుకు చెందిన నవీన్(25)ను అరెస్టు చేశారు. వారి నుంచి 3 కార్లు, మోటర్ సైకిల్, మూడు సుత్తులు, రెండు మచ్చుకత్తులు, రెండు చెట్ల అద్దాలు, రెండు కట్టెలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టి.. న్యాయాధికారి ఆదేశాలతో రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

టమోటా కిలో రూ.51

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.51తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.30తో, సరాసరిగా రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19,200తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు చెప్పారు.

సత్యసాయి వేడుకలు సక్సెస్

భక్తుల్లో హర్షాతిరేకాలు



వేడుకలలో చివరి రోజు రాత్రి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయికి మహా మంగళహారతి

పుట్టపర్తి/టౌన్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు విజయవంతంగా ముగియడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ట్రస్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ వల్లే వేడుకలు ఘనంగా జరిగినట్లు భక్తులు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులు ముందుగానే మంత్రులతో కమిటీ ని ఏర్పాటు చేసింది. పట్టణంలో అవసరమైన సౌకర్యాల కల్పన, సుందరీకరణకు రూ.20కోట్లు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముందస్తు ఏర్పాట్లపై తరచూ సమావేశాలు సమీక్షలు నిర్వహించారు. ఈనేపథ్యంలో ఉత్సవాల ప్రారంభం నుంచి రాష్ట్రం, దేశవిదేశాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈక్రమంలోనే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు పుట్టపర్తికి తరలివచ్చి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ముగిసిన నారాయణ సేవ

సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న లక్షల మంది భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 13 నుంచి 12రోజులు నిరంతరాయంగా నారాయణ సేవ కొనసాగించారు. ఆఖరిరోజు సోమవారం రాత్రి భక్తులకు నారాయణ సేవ అందించి ముగించారు. నారాయణ సేవను దాదాపు 5 వేల మంది అందించారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పాడేరు, శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఎక్కువ మంది సేవాదళ్‌లో పాల్గొన్నారు. వీరుగాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు చాలా మంది భక్తులకు తమ వంతు సాయం చేశారు. ప్రశాంతి నిలయం విద్యాసంస్థలు లేజర్‌షో, డ్రోన్లతో ఫొటోలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

జిల్లా యంత్రాంగం సమష్టి కృషి వల్లే..

జిల్లా యంత్రాంగం సమష్టి కృషి ఫలితంగానే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం రాత్రి స్థానిక సాయిఆరామంలో జిల్లా అధికారులతో కలెక్టర్, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త అధ్యక్షతన సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా సౌకర్యాలు, స్వచ్ఛత, వైద్యసేవలు తదితర విభాగాలలో అధికారుల పనితీరును ప్రశంసించారు. శతజయంతి ఉత్సవాలు రాష్ట్ర స్థాయిలోనేగాక జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా ప్రతి శాఖ సమన్వయంతో అద్భుతంగా నిర్వహించిందని కలెక్టర్ అభినందించారు. లక్షలాదిగా పాల్గొన్న భక్తులకు 5వేల మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఒక మంచి కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు అందరూ పాల్గొని ఉల్లాసంగా గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్.శర్మ, మహేష్, ఆనందకుమార్, డీఎఫ్ఓ చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఫొటోలో ఎస్పీ, జేసీ



సత్యసాయిని ధ్యానిస్తున్న నటి సాయి పల్లవి.. భక్తుల తన్మయత్వం







పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో శత జయంతి వేడుకలలో భక్తి గీతాలను ఆలపించి అలరించిన భారతీయ, విదేశీ గాయకులు





సత్యసాయికి పాశ్చాత్య భక్తుల సంగీత నివేదన

30లోపు పది పరీక్ష ఫీజు చెల్లించండి

● జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్

కొత్తచెరువు/అనంతపురం విద్య, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈనెల 30వరకు పబ్లిక్ పరీక్షా ఫీజును చెల్లించవచ్చని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా ఫీజు చెల్లించే సమయంలో విద్యార్థి వివరాలు, మీడియం తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అపార్ ఐడీ పూర్తికానీ విద్యార్థులు ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్ ద్వారా తల్లిదండ్రుల అనుమతి పత్రంతో వివరాలను ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలన్నారు. ఒకేషనల్ ట్రేడ్ ఉన్న పాఠశాలల్లో టీచర్లు లేకపోతే ఆ విద్యార్థులు డీఈఓ దృష్టికి సమాచారం తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వ పరీక్షా విభాగం అధికారులకు తెలియజేస్తామన్నారు. దీంతో ఒకేషనల్ ట్రేడును తొలగించి జనరల్‌గా పరీక్షలు రాయడానికి అవకాశం కల్పిస్తారన్నారు. వివరాల కోసం 7032861795, 9491100431 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ పరీక్షల ఫీజు చెల్లింపులో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇప్పటికే ఈపరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. అన్ని యాజమాన్యాల ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుడైస్ పోర్టల్‌లో విద్యార్థి వివరాలు ధ్రువీకరించడానికి వెబ్‌సైట్‌లోని పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏసీ వెంకటేష్, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, ఏఎస్ఓ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ నాగరాజులతో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 970222436, 8886555174,9440839419,9182115437 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం ఏకగ్రీవం..!

ఆరు పదవులకు.. ఆరు నామినేషన్లు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి ఈశ్వర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం పాలక వర్గం ఎన్నిక ఏకగ్రీవమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో చోటు చేసుకున్న అవకతవకల నేపథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా క్రికెట్ సంఘం అండతో క్రీడాకారుల ఎంపికలో అక్రమాలకు సహకరించినట్లు పెద్ద చర్చ సాగింది. ఈ క్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇదివరకు పనిచేసిన పాలకవర్గ సభ్యులు తప్పుకుని... కొత్త వాళ్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. గతంలో జిల్లా క్రికెట్ సంఘంలో పని చేసిన వ్యక్తులు తిరిగి తమకు పదవులు కావాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఇందులో జిల్లాలో నివాసం లేని వ్యక్తులు పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధ్యక్ష పదవి కోసం హైదరాబాద్‌లో ఉండే వ్యక్తి తరఫున సోమవారం నామినేషన్ వేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్‌గా ఉన్న వ్యక్తి కార్యదర్శి పదవికి నామినేషన్ వేయగా.. స్థానికేతరుడుగా ఉన్న వ్యక్తి ఉపాధ్యక్ష పదవికి, గతంలో సంఘంలో పనిచేసి క్రికెట్‌తో సంబంధం లేని, సెలెక్షన్స్ అవకతవకల్లో పేరు ఉన్న వ్యక్తి కోశాధికారి పదవికి, సహాయ కార్యదర్శి పదవికి క్రికెట్ ప్లేయర్, కౌన్సిలర్‌కు క్రికెట్‌కు సేవ చేయని వ్యక్తి నామినేషన్లు వేశారు. ఆరు పదవులకు ఆరుగురే నామినేషన్లు వేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల అధికారి, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్ పర్యవేక్షణలో జిల్లా క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం నామినేషన్లు వేసిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.. అధ్యక్షుడు-సి శ్రీనాథ్, కార్యదర్శి-ఎ.యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు- నూర్ మహ్మద్‌ఖాన్, సహాయ కార్యదర్శి- ఎన్. సర్దార్, కోశాధికారి- జె.మురళీకృష్ణ, కౌన్సిలర్-హెచ్.అన్సార్‌ఖాన్ ఉన్నారు. ఆరు పదవులకు ఆరుగురే నామినేషన్లు వేయడంతో ఈనెల 29వతేదీ సర్వసభ్య సమావేశం, ఏకగ్రీవ ప్రకటన లాంచనమేనని తెలుస్తోంది. 2025-28 సంవత్సరానికి నూతన కార్యవర్గం పదవీ కాలం కొనసాగనుంది.

బాల బాలికల క్రికెట్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-17 బాల, బాలికల క్రికెట్ జట్లను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లా బాల, బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ బాలుర సెక్రటరీలు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బాలికల సెక్రటరీలు శకుంతల, సుహాసిని ప్రకటించారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు సునీల్, శరణ్, వేణు, గౌసియా, ఆనంద్, వెంకటేశులు, యమున, శ్యామల, చామంతి, లీలారాణి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


● బాలికల జట్టుకు పూర్ణచంద్రిక, తరుణిక, చక్రిక, హిమవర్షిణి, లక్ష్మోహన్, ఛాయశ్రీ, అక్షర, బృంద, సంజన, జస్మిక, మహ్మదీ, శ్రావణి, గోపి చందన, కాత్యాయని, శృతి కీర్తన, సమత ఎంపికయ్యారు.

● బాలుర జట్టుకు జయప్రకాష్, రంజిత్‌కుమార్, పునీతేశ్వర్, గోవర్ధన్, కౌశిక్, సీతారామ్, తన్మయికృష్ణ, వర్ల జయదీప్, వెంకటసాయి, వెంకటసాయి, సంతోష్, కార్తీక్, మహ్మద్ సాబీర్, తరుణ్ కుమార్ రెడ్డి, మనోజ్, లఖిత్, మహేంద్ర ఎంపికయ్యారు.

స్పిన్ ఉచ్చులో ఒడిశా

● 126 పరుగులకే కుప్పకూలిన వైనం
● కూచ్ బెహార్ అండర్-19 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర పట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర బౌలర్లు లోహిత్, కార్తీక్‌రెడ్డి స్పిన్ మాయాజాలానికి ఒడిశా జట్టు 126 పరుగులకే కుప్పకూలింది. చెరో నాలుగు వికెట్లతో చెలరేగడంతో స్వల్ప స్కోరుకే చాప చుట్టేసింది. కూచ్ బెహార్ అండర్-19 క్రికెట్ టోర్నీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్ర-ఒడిశా జట్ల మధ్య మ్యాచ్ రెండోరోజు సోమవారం కొనసాగింది. ఆంధ్ర జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 246-7తో రెండో రోజు ఆట ఆరంభించింది. కేవలం 36పరుగులు జోడించి మిగిలిన 3వికెట్లు కోల్పోయింది. ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 94.4ఓవర్లలో 282 పరుగులు సాధించింది. ఇందులో ఏఎన్‌వీ లోహిత్ 71పరుగులు సాధించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఒడిశా 63.1ఓవర్లలో 124పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు సుభాసిస్ మల్లిక్ 40, ప్రశాంత్ మోక్షిత్ 35పరుగులు చేశారు. ఆంధ్ర బౌలర్లు ఏఎన్‌వీ లోహిత్, కార్తీక్‌రెడ్డి తమ స్పిన్ మాయాజాలంతో ఒడిశా నడ్డివిరిచారు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రజట్టు రెండోరోజు ఆటముగిసే సమయానికి 15ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 46పరుగులు సాధించింది. బీసీసీఐ రెఫరీ వరుణ్‌కుమార్, అంపైర్లు జై సంఘని, సబిసాచి సర్కార్‌లు మ్యాచ్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, కమలాకర్ నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.



ఒడిశా బ్యాటర్లకు చుక్కలు చూపిన ఆంధ్ర బౌలర్లు లోహిత్, కార్తీక్‌రెడ్డి



ఒడిశా వికెట్ తీసిన ఆనందంలో ఆంధ్ర ఆటగాళ్లు

అందుబాటులోకి 20 రకాల ప్రభుత్వ సేవలు


● డిజి లక్ష్మీ సేవాకేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే



డిజి లక్ష్మీ సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిజి లక్ష్మీ సేవా కేంద్రంలో 20రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి వారు డిజి లక్ష్మీ సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజీ లక్ష్మీపథకం కింద పట్టణ పేద మహిళలు నడిపే 10వేల కియోస్క్‌ల ద్వారా సుమారు 20రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాలు పొందవచ్చని తెలిపారు. దీంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తక్కువ ఖర్చుతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతాయని పేర్కొన్నారు. డిజి లక్ష్మీసేవాకేంద్రాల సంఖ్య పెంచుతామని, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ, మెప్మా అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ సతీష్ కేసును సీబీఐకి అప్పగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కుమ్మర శాలివాహన సంఘం నాయకులు

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే సీఐ సతీష్ కుమార్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని కుమ్మర శాలివాహన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎస్పీకి వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఐ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. పదిరోజులు గడిచినా ఇది హత్య..? ఆత్మహత్య..? అన్న విషయం తేలలేదన్నారు. హత్య అయితే నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. టీటీడీ పరకామణి కేసులోని నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ కుటుంబానికి పరిహారం అందించాలన్నారు. పిల్లల చదువుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, ఓబులపతి, గోపాల్ మలరాయుడు, రామ్మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్‌కు ఘన స్వాగతం


శ్రీరామ్ తరణికంటికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి సోమవారం అనంతపురం పర్యటనకు వచ్చారు. ఆయనకు నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్ ఆనంద్ ఘన స్వాగతం పలికారు. పూలమొక్క అందజేసి స్వాగతించారు. అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, పీటీసీ ప్రిన్సిపాల్ వాసుదేవన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


ఇస్మాయిల్ (ఫైల్)

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు షేక్ ఇస్మాయిల్ (79) మృతి చెందాడు. మండలంలోని పాతకల్లూరుకు చెందిన షేక్ ఇస్మాయిల్ వ్యవసాయం చేస్తూ సీపీఎం మండల కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. అయితే గత ఐదు రోజుల క్రితం ఆగ్రహారం నుంచి పాతకల్లూరు వెళ్లడానికి 44వ జాతీయ రహదారిని దాటుతుండగా గుత్తి నుంచి అనంతపురం వైపు వెళుతున్న బొలేరో వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

శింగనమల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పత్తికి క్వింటాకు రూ.12 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయా రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శింగనమల సచివాలయం వద్ద అధికారులకు వినతి పత్రం అందజేశారు. అలాగే రాచేపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న మీనీ లెదర్ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుయాదవ్, తరిమెల రామాంజినేయులు, తరిమెల భాస్కర్, నేసేమధు తదితరులు పాల్గొన్నారు.

మర్తాడు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి

● రాయలసీమ రైతు వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు రోడ్డు నిర్మాణాన్ని 10 రోజుల్లో చేపట్టాలని, లేకపోతే నిరాహార దీక్ష చేపడతామని రాయలసీమ రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి అక్బర్ హెచ్చరించారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆయన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గార్లదిన్నె నుంచి మర్తాడు మీదుగా కోటంకకు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయమైందన్నారు. ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అరగంట పట్టే ప్రయాణం రెండు గంటలు పడుతోందని వాపోయారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ బండారు ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వెంకటరమణారెడ్డి, నాయకులు వన్నూరప్ప, బాషా, ఖలందర్, వెంకటశివ, జనార్దన్, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతును ఆదుకోవాలి

కనగానపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం నాయకులు మహాదేవ, బాలరాజు, మల్లికార్జున, గోవిందు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో అరటి పంటలను సోమవారం వారు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ బోయపాటి సుదాకర్ చౌదరిని కలిసి మాట్లాడారు. గిట్టుబాటు ధరతో అరటిని కొనుగోలు చేయకపోవడంతో రైతన్నలు పెట్టుబడి రాక అప్పులు పాలవుతున్నారన్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు.

నేడు మామిళ్లపల్లిలో 'రైతన్నా.. మీ కోసం'

● పాల్గొననున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొననున్నట్లు చెప్పారు.

టీడీపీ శ్రేణుల హర్షం

శింగనమల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ శింగనమల మండల కన్వీనర్‌గా పెరవలి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గోరంట్ల మారుతీనాయుడు నియమితులయ్యారు. దీంతో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తగా కొన్నేళ్ల నుంచి పార్టీ కోసం పని చేసిన మారుతీ నాయుడికి కన్వీనర్‌గా అవకాశం ఇచ్చిందుకు ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నాయకులు ఆలం నరసానాయుడు, పర్వీన్‌తాజ్ తదితరులకు మారుతీనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా పీజీఆర్ఎస్

● పలు శాఖల అధికారులు డుమ్మా

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అధికారుల నుంచి స్పందన కరువైంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి సోమవారం జిల్లాస్థాయితో పాటు మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే దీని పట్ల పలు శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి పలు శాఖ అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో తూతూ మంత్రంగా నడించింది. మండలంలో ప్రధానంగా పదిహేను శాఖలున్నాయి. అయితే అందులో కేవలం వెలుగు, స్త్రీశిశు సంక్షేమ, రెవెన్యూ, ప్రజాపరిషత్తు, పశువైద్యం, ఉపాధి హామీశాఖల అధికారులు మాత్రమే వచ్చారు. మిగతా శాఖల అధికారులు కనిపించలేదు. ప్రతి వారమూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఐదారు శాఖల అధికారులు తప్పా.. ఇతర శాఖల అధికారులు డుమ్మాకొడుతూనే ఉన్నారు. దీన్నిబట్టిచూస్తే ప్రజా సమస్యల పరిష్కార వేదిక పట్ల అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.


తక్కువ సంఖ్యలో హాజరైన అధికారులు

అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

● రైతన్నా.. మీ కోసం కార్యక్రమం ప్రారంభం

న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోంది. ఈ క్రమంలో పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు రైతన్నా.. మీ కోసం అనే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. అందులో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు ధరలు, సబ్సిడీలు, అన్నదాత సుఖీభవ వంటి వాటితో పాటు నీటితొట్టెలు, గోకులాలు, పశుగ్రాసపెంపకం, పశువుల దాణాపంపిణీ, కోళ్లపెంపకానికి ప్రోత్సాహం వంటి వాటిపై అవగాహన కల్పించారు. అలాగే ఈ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు రాసిన లేఖను కరపత్రం రూపంలో రైతులకు అందజేశారు.


చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండిలో ఇంటింటికీ వెళ్లి రైతులకు రైతన్నా మీకోసం కరపత్రాలను పంచుతున్న వ్యవసాయశాఖ ఏడీ లక్ష్మానాయక్, ఏఓ మురళీకృష్ణ, ఎంపీఈఓ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి తదితరులు


నార్పలలో కరపత్రాలు పంచుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రవి, ఏఓ చెన్నవీరాస్వామి, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు


రామగిరిలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ కవిత, వీఆర్వో ముత్యాలు, ఎంపీఈఓ రఘు, సింగిల్‌విండో డైరెక్టర్ నాగరాజు తదితరులు

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

● ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

● రూ.32 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం


సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా గుంతల రోడ్లు లేకుండా చేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. స్థానిక అశోక్‌నగర్‌లో రూ.32 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం వారు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అలాగే రూ.22లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. తర్వాత మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నగరంలో ఒక్క రోడ్డు కూడా నిర్మించిన పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. 30 ఏళ్లగా సమస్యగా ఉన్న డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. పూర్తిస్థాయిలో చెత్త తొలగించి ఆ స్థానంలో పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో అనంత నగరాన్ని ఏపీలోనే నెంబర్ వన్‌గా నిలుపుతామని పేర్కొన్నారు. మేయర్ వశీం తన సొంత డివిజన్‌ను కూడా అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 30లోగా దరఖాస్తు చేసుకోండి


హౌసింగ్ డీఈతో చర్చిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ తదితరులు

కనగానపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పీఎంఏవై ఇళ్లు మంజూరు చేస్తామని, ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ తెలిపారు. మండల కేంద్రానికి సోమవారం వచ్చిన ఆయన్న మార్కెట్‌యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాజాకృష్ణ, ఏఈ మహేష్ కలిసి మాట్లాడారు. హౌసింగ్ జాబితాపై గ్రామాల వారిగా చర్చించారు. తర్వాత డీఈ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ మండలంలో 989 మంది పీఎంఏవై ఆవాస్ యాప్‌లో నమోదు చేశారని, మిగిలిన వారు గడువు లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సొంత స్థలం ఉన్నా, లేకున్నా ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

ఇటుకలపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం


గంగులకుంటలో సమస్యలపై సర్వే చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు

అనంతపురంరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి గ్రామంతో పాటు రాప్తాడు మండలం గంగులకుంటలో సోమవారం అనంతపురం నగరానికి చెందిన ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటైంది. ఆకుతోటపల్లిలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ,అలాగే గంగుల కుంటలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్థులు గ్రామ ప్రజలకు సామాజిక సమస్యల గురించి అవగాహన కల్పించారు. సమస్యలకు సంబంధించిన వివరాలు సేకరించారు. తర్వాత ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ బాలికల బెటాలియన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 60మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్‌రెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, సురేంద్ర, ఎన్‌సీసీ ఆఫీసర్ జైను బేగం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు బాబా ఫక్రుద్దీన్, భార్గవి, రేష్మా తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

అనంతపురం విద్య, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 26 వ తేదీన చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని వామపక్షాలనాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్వీ నాయుడు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా గత ఆరేళ్లుగా పోరాటాలు చేస్తున్నా.. కేంద్రం పట్టించుకోకుండా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుందన్నారు. కార్మిక హక్కులను కాలరాసేవిధంగా 44కార్మికచట్టాలను సవరణచేసి 4లేబర్‌కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్రం విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టనున్న సమ్మెలో అన్నివర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నతరాజు, ఏసురత్నం, కేశవరెడ్డి, చంద్రశేఖర్, బాలరంగయ్య, కృష్ణమూర్తి, రాజేష్‌గౌడు, చెన్నప్ప, వెంకటనారాయణ, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలి

అనంతపురం విద్య, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాకాకుండా ఎలాంటి పర్మిషన్‌లు లేకుండా ఫిట్‌నెస్ లేని బస్సులలో విద్యార్థులను తీసికెళుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి బస్సుల వల్ల ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై పరిశీలన చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో డీఆర్ఓ మలోలను కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు శ్రీనివాసులు, సురేంద్ర, అశోక్, తేజ, సింహ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్‌కు ఐదుగురి ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సౌత్‌జోన్ బాలుర అండర్-14 క్రికెట్ జట్టులో ఐదుగురు ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు చోటు దక్కింది. వీరిలో మోక్షజ్ఞతేజ్(కళ్యాణదుర్గం), పంకజ్(గుత్తి), హేమచంద్రనాయక్ (అనంతపురం), రోహిత్ (హిందూపురం), కృతిక్‌సాయి(పరిగి)ఉన్నారు. ఈనెల 25 నుంచి జరిగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-14 అంతర్‌జోన్ క్రికెట్ పోటీలో సౌత్‌జోన్ జట్టు తరపున వీరు ఆడనున్నారు. సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల లో సోమవారం పశువులకు గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పశుగణాభివృద్ధిసంస్థ ఈఓ డాక్టర్ వెంకటేష్, పలువురు వెటర్నరీ డాక్టర్లు పాల్గొని పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. అలాగే పాడి రైతులకు తగు సూచనలు చేశారు. ముఖ్యంగా లింగనిర్ధారణ ప్రాముఖ్యత గురించి వివరించారు. దాదాపు 60పశువులకు గర్భకోశ చికిత్సలు అందించారు. పశువైద్యాధికారులు శ్రీకాంత్, మౌలాలి, శివకుమార్, జేవీఓ ఆది నరసింహులు, ఓఎస్ రామకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయ వంటకాలతోనే.. ఆరోగ్యం

● ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి


సంప్రదాయ వంటకాలను ప్రదర్శిస్తున్న మహిళలు

అనంతపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వంటకాలు తీసుకుంటేనే ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి సూచించారు. స్థానిక జిల్లా పురావస్తు శాఖ ప్రదర్శనశాలలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఇంటాక్, డిస్కవర్ అనంతపురం, లేడీస్ క్లబ్, ఇన్నర్‌వీల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు 'మన ఊరి సంప్రదాయ వంటల పోటీలు' నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంప్రదాయ వంటకాలనేవి చాలా ముఖ్యమైన పోషకాలతో కూడినవన్నారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు విరుగుడు ఈ సంప్రదాయ వంటకాల్లోనే ఉందన్నారు. అనంతపురం జిల్లా సంప్రదాయ వంటకాలైన రాగి ముద్ద, జొన్న, సద్దరొట్టెలు వంటివాటికి ఎంతో పేరు గాంచిందని తెలిపారు. నేటితరం వారంతా ఇలాంటి వంటకాల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు జయంతి మాట్లాడుతూ... మన పూర్వీకులు రసాయనాలు, పురుగులమందులు వినియోగించని ఆహారాన్ని తీసుకోవడంవల్లే ఎంతో ఆరోగ్యంగా జీవించారని అన్నారు. మన దేహానికి మంచి పోషకాలందే ఆహారాన్ని తీసుకోవాలంటే అది సంప్రదాయ వంటల వల్లనే సాధ్యమవుతుందన్నారు. పురావస్తుశాఖ ఏడీ స్వామినాయక్ మాట్లాడుతూ... సంప్రదాయ వంటకాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఇలాంటి కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయ వంటకాలు మన పూర్వీకులు మనకు ఇచ్చిన వారసత్వ సంపద అని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. అనంతరం నిర్వహించిన వంటల పోటీల్లో మహిళలు వివిధ రకాల సంప్రదాయ వంటలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇంటాక్ కో కన్వీనర్ కృష్ణమూర్తి, సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, రామాంజనేయులు, టీవీ రెడ్డి, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, యాడికి సూర్యనారాయణరెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ పద్మ, పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శభాష్.. అమిన్‌తాజ్

● ఇంటర్నేషనల్ స్కేటింగ్‌లో అద్భుత ప్రతిభ


మెడల్స్‌తో అమిన్‌తాజ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ స్కేటింగ్‌లో నగరానికి చెందిన అమిన్ తాజ్ అద్భుత ప్రతిభ చూపి ఆకట్టుకుంది. మహారాష్ట్రలోని పూణెలో జరిగిన బాలికల విభాగం అండర్-7 ఇంటర్నేషనల్ స్కేటింగ్ పోటీల్లో అమిన్‌తాజ్ పాల్గొని అద్భుత ప్రదర్శనతో రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించింది. మూడు పతకాలు సాధించిన అమిన్‌తాజ్‌ను సోమవారం పలువురు అభినందనలతో ముంచెత్తారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్లు

అనంతపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు అనంతపురం జిల్లా నుంచి రెండు జట్లు ఎంపికయ్యాయి. జిల్లాకేంద్రంలోని జేవీవీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్లను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అభినందించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా కార్యదర్శి వీరరాజు మాట్లాడుతూ... గుమ్మగట్ట మండలం గోనబావి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ హైస్కూల్‌కు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థినులు వర్ధిని, నిహారిక, శ్రీలక్ష్మి, అలాగే ప్రైవేట్ స్కూల్స్ విభాగంలో రాప్తాడు మండలం గొల్లపల్లి మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు సాయి చరిత, సుదర్శన్‌రెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానాల్లో గెలుపొందిన వారిని మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరంతా డిసెంబరు 21, 22, 23వ తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

క్వారీలపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలో క్వారీ తవ్వకాల వల్ల పంట పొలాలకు ఇబ్బందిగా ఉందని, ఆ సమస్య నుంచి కాపాడాలని అనంతపురం రూరల్ మండల పరిధిలోని క్రిష్ణంరెడ్డి పల్లి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇచ్చారు. పలువురు మాట్లాడుతూ.. సర్వే నెంబరు-231లో పలు క్వారీల వారు మైన్స్ సేఫ్టీ అనుమతులకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్నారన్నారు. దీంతో దుమ్మూ, ధూళి పడి పంటలు దెబ్బతింటున్నాయని వాపోయారు. అధికారులు ఆ క్వారీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొళాయి, పైపుల ధ్వంసంపై ఫిర్యాదు

నార్పల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆకతాయిలు తాగునీటి పైపులు, కొళాయిలు ధ్వంసం చేశారు. ఈ మేరకు సోమవారం హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి 11 గంటలకు గుర్తు తెలియని ఆకతాయిలు పాఠశాలలోకి ప్రవేశించి కొళాయిలను, మోటారు వద్ద పైప్‌లైన్ పైపులను, నీటి సంపును ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ కిట్ల వితరణ

అనంతపురంరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు జిల్లా పరిషత్ పాఠశాలకు కెనరాబ్యాంకు వారు స్పోర్ట్స్ కిట్లను వితరణ చేశారు.గ్రామంలో బ్యాంకు నూతన భవనం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రూ.30వేలు విలువ చేసే స్పోర్ట్స్ కిట్లను బ్యాంకు ఏజీఎం శ్రీనివాసులు అందజేశారు. బ్యాంకు మేనేజర్ చందన్‌కుమార్, హెచ్‌ఎం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీకి ఘన సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులు

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులుగా నూతనంగా నియమితులై ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన నగరంలోని 5వ క్లస్టర్ ఇన్‌చార్జి చేపల హరి తదితరులు సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. పార్టీలో పద వలు ఇచ్చినందుకు ఆయనతో పాటు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను గజమాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత ఎమ్మెల్యే కొత్త కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. పార్టీకి మీరే మూలస్తంభాలని అన్నారు. మీ కష్టం వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి ఇప్పటి నుంచే అందరం సన్నద్ధం కావాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఏ సమస్య ఉన్నా...తన దృష్టికి తేవాలని చెప్పారు. కార్యక్రమంలో కో-క్లస్టర్ ఇస్మాయిల్, యూనిట్ ఇన్‌చార్జులు పెద్ద మారెప్ప, తాటి మధు, ఓంకార్‌రెడ్డి, కరీం, టీడీపీ జిల్లా నాయకుడు రాయల్ మధు, కన్వీనర్లు మహబూబ్ ఖాన్, సోమశేఖర్, దలవాయి రామకృష్ణ,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి చేయూత

● రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత

అనంతపురం న్యూటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం పంచాయతీకి చెందిన జనసేన కార్యకర్త పవన్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, నగరాధ్యక్షుడు బాబురావు రామ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ. 5లక్షల చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. పవన్ కుమార్ మృతి తీరని లోటన్నారు. కార్యకర్తలకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో జనసేన అధినేత ఈ బీమా అందించారన్నారు. అధినేత ఆదేశాల మేరకు కార్యకర్తలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శులు లాల్‌స్వామి, వెంకటరమణ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్త కుటుంబానికి చెక్కును అందజేస్తున్న టీసీ వరుణ్

ఉత్సాహంగా రైతన్నా... మీ కోసం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సోమవారం రైతన్న.. మీ కోసం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, అధికారులు ఉత్సాహంగా నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై అన్నదాతలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వ్యవసాయ సంచాలకులు రవి తెలిపారు. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.


తాడిపత్రి: యర్రగుంటపల్లిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు రవి


రాయదుర్గం : ఆవులదట్లలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏడీఏ పద్మజ, అధికారులు, రైతులు



ఉరవకొండ : వెలిగొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


కుందుర్పి: అపిలేపల్లిలో అవగాహన కల్పిస్తున్న మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు, అధికారులు


గుమ్మఘట్ట : వీరాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ కాలవ సన్నన్న, నాయకులు


విడపనకల్లు : పాల్తూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, రైతులు, నాయకులు


కణేకల్లు : యర్రగుంటలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ మండల కన్వీనర్ వన్నారెడ్డి, నాయకులు

క్లుప్తంగా ..

పాఠశాలకు రూ.లక్ష అందజేత


చెక్కును అందజేస్తున్న కార్యదర్శి

ఉరవకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కోసం ఎస్కేఆర్సీ క్లబ్ తరపున రూ.లక్ష చెక్కును అందజేశారు. స్థానిక పాఠశాలలో హెచ్ఎం సత్యనారాయణకు క్లబ్ సెక్రటరీ రవీంద్ర సోమవారం ఆ చెక్కును అందించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

గుత్తి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురంలో రూ. 20 లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి, రూ.32 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, ఆసుపత్రి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, మండల కన్వీనర్, లక్ష్మీరంగయ్య, సర్పంచ్ లింగమయ్య, టీడీపీ సీనియర్ నాయకులు, బర్దీవలి, రామచంద్ర, తిమ్మప్ప, గోవర్ధన్, గైడ్ రంగప్ప, రామకృష్ణ, మద్దిలేటి, సాంబశివ, రామంజీ, నరసింహులు, నారాయణస్వామి, లక్ష్మణరావు, వెంకీ, అంజీ, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ ప్రభాకర్, పంచాయితీ రాజ్ డీఈఈ మురళీధర్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పెద్దవడుగూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పత్తిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో అప్పేచర్లలోని సచివాలయం వద్ద రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా 30 శాతం బోనస్ ప్రకటించి పత్తిపంట క్వింటా రూ.12 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ, అల్లాబకాష్, రంగనాయకులు, రైతులు పాల్గొన్నారు.

● పుట్లూరు : జిల్లాలో టన్ను అరటిని రూ.22వేలతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం దగ్గర సోమవారం వారు మాట్లాడారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ.. వ్యాపారులు, మధ్యవర్తులు ఏకమై అరటి రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వీరయ్య, పూలరంగడు పాల్గొన్నారు.

● శెట్టూరు : మొక్కజొన్న, అరటి, కంది తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మండలంలోని రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరమ్మకు వారు సోమవారం వినతి పత్రం అందజేశారు.

కుట్టుశిక్షణ ప్రారంభం

బెళుగుప్ప, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో కుట్టుమిషన్ శిక్షణ తరగతులను టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున సోమవారం ప్రారంభించారు. మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సంస్థ ప్రోగ్రామ్ అధికారి అబ్దుల్ రషీద్, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ రమాదేవి, వీఆర్వో ప్రదీప్, మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిప్పేస్వామి, నారాయణ స్వామి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కోశాధికారి ఆంజనేయులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా బాబు, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర, తరుణ్, నోమన్, కిరణ్, కళాశాల ప్రధాన కార్యదర్శిగా రామ్‌దాస్, సహాయ కార్యదర్శిగా జైచంద్ర, అవినాష్, రాకేష్, మణికంఠ కోశాధికారిగా వన్నూరుస్వామితో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను, 44 మంది కౌన్సిల్ సభ్యులతో కమిటీని ఎన్నుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తరుణ్, కేటీఎస్ కాలేజ్ అధ్యక్షుడు భానుప్రకాష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మున్నా, నవీన్, వినయ్ పాల్గొన్నారు.

ఇళ్లు, స్థలాల కోసం దరఖాస్తుల వెల్లువ


దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

యాడికి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఒక్కరోజులోనే ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. 115మంది లబ్ధిదారులు సోమవారం దరఖాస్తులు అందజేసినట్లు హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్ తెలిపారు. ఇళ్లు, ఇంటిస్థలాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శనివారం అధికారులు వెల్లడించారు. దీంతో సోమవారం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ఎంపీడీఓ కార్యాలయంలో క్యూ కట్టారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని, అర్హులైన వారికి కచ్చితంగా లబ్ధి చేకూరుతుందని అధికారులు అధికారులు తెలిపారు.

3న హనుమద్ వ్రతం


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో డిసెంబరు మూడున హనుమద్ వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ మేడేపల్లి విజయరాజు తెలిపారు. సోమవారం హనుమాద్ వ్రతంపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 2న వివిధ ప్రాంతాల నుంచి వచ్చే హనుమాద్ దీక్షాపరుల ఇరుముడి సమర్పణకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ ఏబీవీబీఎస్ శ్రీనివాస్, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, డీఎస్పీ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహ్మద్, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపోత్సవం


లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గంరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన శ్రీమద్దానేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం మార్గశిర మాసంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉజ్జయిని పీఠాధిపతి శివాచార్యస్వామి ఇందులో పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

ఉరవకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలలో భాగంగా సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు టెంకాయల జలంతో అభిషేకం చేశారు. గణపతి. సుదర్శన, లక్ష్మీనారాయణస్వామి హోమాలను నిర్వహించారు. కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో దివాకర్ శర్మ, నాగరాజుశర్మ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మాదిరి పరీక్ష

శెట్టూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) మాదిరి పరీక్షను స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. వివిధ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు దీనికి హాజరయ్యారు. ఈ పరీక్షలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళ్యాణదుర్గం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దేనాయక్ రూ. 3116, రూ. 2116, రూ. 1116 బహుమతిగా ఇస్తారని మండల విద్యాధికారులు శ్రీధర్, వాణిదేవి తెలిపారు.

'సార్.. అన్నదాత సుఖీభవ జమ కాలేదు'

బెళుగుప్ప, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సారూ... ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ నగదు తమ బ్యాంకు ఖాతాలోకి జమ కాలేదని మండలంలోని శ్రీరంగాపురం మహిళా రైతులు ఏఓ పృథ్వీసాగర్ వద్ద సోమవారం వాపోయారు.తమకు పీఎం కిసాన్ నగదు రూ.రెండు వేలు మాత్రమే జమ అయ్యిందని, రూ. ఐదు వేలు జమ కాలేదని, దీనిపై ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా పరిష్కరించడంలేదని పక్కీరమ్మ, వన్నూరమ్మ, కుమారమ్మ తెలిపారు. రీసర్వే చేయడంతో సమస్య తలెత్తిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఏఓ వారికి తెలిపారు.


ఏఓకు ఫిర్యాదు చేస్తున్న శ్రీరంగాపురం మహిళలు

విచారణ జరిపించండి

అనంతపురం కలెక్టరేట్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ ఎంపీ రంగయ్య వైసీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు ఎంపీ నిధులకు సంబంధించి పూర్తి సమగ్ర విచారణ జరిపించాలని కళ్యాణదుర్గం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ బాల్యం రాజేష్ కోరారు. ఈ మేరకు అనంతపురంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు అందజేశారు. మాజీ ఎంపీ సిఫార్సు మేరకు శెట్టూరు మండలంలోని యాటకల్లు గ్రామంలో శ్రీరామస్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించిన మొత్తం నిధులను పని చేపట్టకుండానే డ్రా చేశారని ఆరోపించారు. వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

● ఎంపికైనా మాక్ అసెంబ్లీకి పంపలేదు...
పదోతరగతి చదువుతున్న విద్యార్థిని మాక్ అసెంబ్లీకి ఎంపికైనా పంపలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. బెళుగుప్ప మండలం కాలువపల్లికి చెందిన హరిజన నాగన్న కుమార్తె లహరి కాలువపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. మాక్ అసెంబ్లీకి పెట్టిన పోటీలలో ఉరవకొండ నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలిచిందని, విజయవాడకు వెళ్లాలని చెప్పిన స్కూల్ ఉపాధ్యాయులు చివరకు వద్దని చెప్పారని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

● ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి
కణేకల్లు : ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మల్లెల ప్రసాద్ సోమవారం జిల్లా గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు.ప్రిన్సిపాల్ ఆంజనేయులు కళాశాల పూర్వ విద్యార్థులతోనూ, విద్యార్థుల తల్లిదండ్రులతోనూ కళాశాల అభివృద్ధి, సౌకర్యాలు ఏర్పాటు చేస్తామంటూ సొమ్ము వసూలు చేస్తున్నాడని, అధికారులు స్పందించి ఆయనపై పూర్తిగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

కళ్యాణదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు కంబదూరు మండలం నూతిమడుగు గురుకుల పాఠశాల విద్యార్థి జీ పురుషోత్తమ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప సోమవారం తెలిపారు. అండర్ -14 టెన్నికాయిట్‌లో శ్రీకాకుళంలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. వచ్చేనెలలో కేరళలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటున్నట్లు తెలిపారు.


పురుషోత్తమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయ ఎస్‌జీఎఫ్ గేమ్స్‌కు వర్షిత



గుంతకల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ నరసాపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి ఏ వర్షిత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ క్రీడలకు ఎంపికైంది. గుంటూరు జిల్లా వినుగొండలో సోమవారం నిర్వహించిన 800, 1,500 మీటర్ల పరుగు అథ్లెటిక్ పోటీల్లో మొదటి స్థానాన్ని సాధించింది. దీంతో ఆమె జాతీయ క్రీడలకు ఎంపికైంది. వినుగొండ ఎమ్మెల్యే వెంకట శివ సీతా రామ ఆంజనేయులు వర్షితకు పతకాన్ని అందజేశారు.

చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండాకు చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు రూపానాయక్ విద్యుత్ ప్రమాదంతో ఇటీవల మరణించాడు. అతను జనసేన పార్టీలో సభ్యత్వం ఉండటంతో.. ప్రమాద బీమా క్రింద రూ. ఐదు లక్షలు మంజూరైంది. ఆ చెక్కును బాధిత కుటుంబసభ్యులకు మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబు సోమవారం అందజేసినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ తెలిపారు.

గడువు పొడిగింపు

రాయదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో అనధికారిక భవనాలు, అనధికార లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు జనవరి 23 వరకు గడువు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. నిర్ణీత రుసుము చెల్లించి సంబంధిత పత్రాలను సమర్పించి క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏకగ్రీవంగా ఎంపిక

బెళుగుప్ప, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెళుగుప్ప టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా తిప్పేస్వామి, ఎర్రగుడికి చిరంజీవి, శీర్పికి శ్యాంసుందర్, నరసాపురం పంచాయతీకి చిన్న పల్లెప్పను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు టీడీపీ నాయకులు సోమవారం తెలిపారు. ఏకాభిప్రాయంతో ఈ ఎంపిక చేశామన్నారు.

చింతఫలం వేలంపాట

కుందుర్పి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలయనూరు గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ గోవిందమ్మ అధ్యక్షతన సోమవారం చింతఫలాలు వేలం పాట నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు తెలిపారు. ఈ వేలంపాట ద్వారా పంచాయతీకి రూ. 1.75 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులు



సరి చేసిన విద్యుత్ తీగలు

బొమ్మనహాళ్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, బీసీ హాస్టల్ వద్ద విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులు వేలాడుతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డి వెంటనే స్పందించి.. తమ సిబ్బందితో ఆ విద్యుత్ తీగలను పైకిలాగించారు.

ప్రతిభ చాటిన అక్కాచెల్లెళ్లకు సన్మానం


మాట్లాడుతున్న సీఐ మనోహర్

గుంతకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిభచాటి జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు, అక్కాచెల్లెళ్లు అమూల్య, నందినిని స్థానిక ఎస్కేపీ జూనియర్ కళాశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మనోహర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి క్రికెట్‌లోనూ రాణించి గుంతకల్లుకు మంచి పేరుతేవాలన్నారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, సాయి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంటు ప్రభాకర్, జేవీవీ నాయకులు చంద్రశేఖర్, రవిప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులు

గుంతకల్లుటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం తుమకూరులో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక మాంటిసోరి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-30 కేజీల విభాగంలో నాల్గవ తరగతి విద్యార్థి ఇషాన్ మొదటి స్థానంలో, అండర్-35 కేజీల విభాగంలో నాల్గవ తరగతి విద్యార్థి తారక్ మొదటి స్థానంలో, అండర్-40 కేజీల విభాగంలో మూడో తరగతి విద్యార్థి లక్షిత్ మొదటి స్థానంలో, అండర్-50 కేజీల విభాగంలో ఏడో తరగతి విద్యార్థి హర్షిత్‌రెడ్డి మూడవ స్థానంలో నిలిచాడు. ఈ విద్యార్థులను కరాటే మాస్టార్ తలారి మల్లికార్జున, స్కూల్ యాజమాన్యం పువ్వాడి శ్రీనివాసులు, నాగార్జున, బండారు అనిల్, వంశీకుమార్ సోమవారం అభినందించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


శివసాయిని సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

గుంతకల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే హై స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న జే లలిత శివసాయి డిల్లీలో గత నెల 29న నిర్వహించిన గేటా యంగ్ సైంటిస్ట్ ఆవిష్కార్ ప్రదర్శనలో పాల్గొన్నారు. గూడ్సు రైళ్లకు విద్యుత్ వినియోగంపై చేసిన సైన్స్ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో రెండో బహుమతి లభించింది. దీంతో శివసాయిని స్థానిక ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాలలో సోమవారం సన్మానించారు. ఇందులో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు అంజి, రైల్వే ఉన్నత పాఠశాల హెచ్ఎం మధుసూదనరావు, ఆర్‌సీఎం తెలుగు మీడియం పాఠశాల హెచ్ఎం రంగస్వామి, సెంయిట్ మేరీ ఇంగ్లీషు మీడియం పాఠశాల హెచ్ఎం దయ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలోడులో సోమవారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నందికోలాటాల మధ్య రథంలో స్వామి వారిని ఊరేగించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్రైం న్యూస్ ..

యువతి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-గూళ్లపాళ్యం రైలు మార్గంలో సోమవారం స్థానిక ధర్మవరం గేటు సమీపంలో రైలు కిందపడి లక్ష్మీ(22) ఆత్మహత్య చేసుకుంది. ఈమె స్థానిక హనుమేష్ నగర్‌కు చెందిన వీరన్న కుమార్తె. లక్ష్మీకి మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో మధ్యాహ్నం ధర్మవరం గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద మృతి

తాడిపత్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిప్రొద్దుటూరు గ్రామంలో రత్నమ్మ (48) సోమవారం అనుమానాస్పదంగా మరణించారు. రత్నమ్మ, శ్రీనివాసరెడ్డి దంపతుల మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. అప్పుడప్పుడు గొడవ పడేవారు. సోమవారం ఉరేసుకొని రత్నమ్మ చనిపోయింది. ఇది ఆత్మహత్యకాదని, ఆత్మహత్య చేసుకుంటే మంచం మీద కూర్చొన్నట్లు ఎలా ఉంటుందని మృతురాలి సోదరుడు మోహన్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాగా, రత్నమ్మ పెద్దకుమార్తె బీటెక్, రెండవ కుమార్తె 9వ తరగతి చదువుతోంది.

చీరల చోరీకి యత్నం


చీరల దుకాణంలో మహిళలు

గుత్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ చీరల దుకాణంలో చీరలను దొంగలించేందుకు ప్రయత్నించిన మహిళను దుకాణదారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని స్పందన శారీ సెంటర్‌లో చీరలను కొనుగోలు చేసేందుకు ముగ్గురు మహిళలు సోమవారం దుకాణంలో వచ్చారు. విలువైన చీరలను చూస్తూ దాదాపు రూ.20 వేల విలువ చేసే చీరలను గుట్టుగా బ్యాగ్‌లో పెట్టుకున్నారు. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డు కావడంతో షాపు యజమాని గుర్తించి వారిని పట్టుకునే ప్రయత్నించగా.. ఇద్దరు మహిళలు పారిపోయారు. దొరికిన ఓ మహిళను పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహోతూరు సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఉరవకొండ అర్బన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ అశోక్ సోమవారం గాయపడ్డాడు. హోతూరు సమీపంలో కల్వర్టు వద్ద కుక్క అడ్డం రావడంతో ఈ ప్రమాదం జరిగింది. అతనికి వజ్రకరూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి, గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు.

ఇంట్లో చోరీ

యాడికి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్‌శర్మ మండలంలోని ఒక సిమెంట్ ఫ్యాక్టరీలో హెచ్‌ఆర్‌హెడ్‌గా పనిచేస్తున్నారు. ఫ్యాక్టరీలో క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఈనెల 17న ఇంటిలో ఎవరూలేని సమయంలో ఇంటిలో దొంగలు పడి.. 1,750 గ్రాముల వెండి ఆభరణాలు, ఎనిమిది గడియారాలు, రూ.50 వేలు విలువజేసే దుస్తులను ఎత్తుకెళ్లారు. అభిషేక్‌శర్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఓ మట్కాబీటర్‌ను సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు. అతని వద్ద ఉన్న రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా

విడపనకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇంటిస్థలాలు కేటాయించాలని స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు మహిళలు, సీపీఐ నాయకులు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఇన్‌చార్జి తహసీల్దారు రమాదేవి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం అనుమతులతో పట్టాలు మంజూరు చేస్తామన్నారు.